ప్రజాశక్తి
శనివారం 6 సెప్టెంబర్ 2025
5
శ్రీ సత్యసాయి





మహాసభలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

నాడు విద్యావెలుగు.. నేడు సమస్యల నెలవు..!

శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని కొడిగనహళ్లి ఎపిఆర్‌జెసి జూనియర్ కళాశాల ఎందరో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపింది. ఇక్కడ చదువుకున్న చాలా మంది ఉన్నత స్థాయికి ఎదిగారు. ఇకప్పుడు ఈ కళాశాలలో సీటు వస్తే చాలు.. జీవితంలో స్థిరపడినట్టే అని విద్యార్థులు, తల్లిదండ్రులు భావించేవారంటే ఈ విద్యాలయం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా గతంలా మారింది. ప్రస్తుతం ఈ విద్యాలయం సమస్యల నెలవుగా మారింది. యువతకు దారి చూపి వారిని ముందుకు నడిపిన కళాశాల సమస్యలతో







- కొడిగెనహళ్లి ఎపిఆర్‌జెసిలో వసతులలేమి
- శిథిలావస్థలో భవనాలు
- 300 మంది విద్యార్థులకు ఒకే ఒక్క రెగ్యులర్ ఉద్యోగి
- సిఎస్ఆర్ నిధులతో పూర్వ వైభవం వచ్చేనా..?
- ప్రభుత్వ తోడ్పాటు అందిస్తే మరింత ఉపయోగం

ప్రజాశక్తి-పరిగి

హిందూపురం నియోజకవర్గం పరిగి మండలం కొడిగనహళ్లి ప్రాంతంలో ఎపిఆర్‌జెసి జూనియర్ కళాశాలను 1989 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రూ. 60 లక్షలతో నిర్మించింది. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్దేశంతో విద్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చింది. మూడు దశాబ్దాల పాటు ఈ కళాశాల ఒక వెలుగు వెలిగింది. ఇప్పుడు ఈ కళాశాలలో ఇంటర్‌లో సీటు కోసం చాలా మంది విద్యార్థులు తపన పడుతుంటారు. అలాంటి కళాశాల పాలకుల నిర్లక్ష్యంతో రానురాను దాని ప్రాభవాన్ని కోల్పోతోంది. ఏడాదికేడాది నిధుల కేటాయింపు తగ్గిపోతుండడంతో దీని నిర్వహణ భారం అవుతోంది. 300 మంది విద్యార్థులున్న ఈ కళాశాలకు కేవలం ఒకే ఒక్క రెగ్యులర్ ఉద్యోగి ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకరు మినహా మిగిలినవారంతా తాత్కాలిక ఉపాధ్యాయులు(గెస్ట్‌ఫ్యాకల్టీలు)తో కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది.

కనిపించని నాటి విద్యా వెలుగులు..!

దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఎపిఆర్‌జెసి ఉంది. ఇందులో చదవిన విద్యార్థులు అనేక మంది అటు చదువులో ఇటు ఆటల్లో రాణించి దేశ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగాలు సంపాదించి ఉన్నత శిఖరాలు అదిరోహించారు. ప్రస్తుతం ఈ కళాశాలను పలు సమస్యలు వెంటాడుతున్నాయి. సుమారు 300 మంది విద్యార్థులు ఇక్కడ చదవుతున్నారు. వీరందరికీ ప్రధానాచార్యులు తప్ప మిగిలా బోధనా సిబ్బంది 17 మంది తాత్కాలిక ఉపాధ్యాయులు (గెస్ట్ ఫ్యాకల్టీ)గా పని చేస్తున్నారు. వారికి కూడా చాలీచాలని వేతనం వస్తోంది. అది కూడా మూడు, నాలుగు నెలలకు ఒకసారి వారికి అందుతోంది. ఇక విద్యార్థులకు భోజనం విషయం మరింత దారుణంగా ఉంది. ఇక్కడ కేవలం ఇద్దరు మాత్రమే వంట మనుషులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో కూడా ఒక్కొక్కరు రెండు మూడు రోజులు సెలవు తీసుకునే పరిస్థితి ఉంది. కళాశాలకు వంట మనుషుల కేటాయింపు విషయంలో ఉన్నతాధికారుల తీరు దారుణం ఉంది. పాఠశాల సమయానికి భోజన సదుపాయం కల్పించలేకపోతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మూలనబడ్డ బెంచీలు

ఇంటర్ నాలుగు గ్రూపులతోనే సరి

ఇంటర్మీడియట్ విద్యకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళాశాలలో నాలుగు గ్రూపులు మంజూరు చేశారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపుల ద్వారా విద్యాబోధన జరుగుతోంది. మారిన టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు నూతన గ్రూపులను కళాశాలకు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవటం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇదే సమయంలో ప్రయివేటు విద్యాసంస్థలు ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా కళాశాలలను అభివృద్ధి చేసుకుని ముందుకుపోతున్నారు. ఇలాంటి సమయంలో గత చరిత్ర ఎంతో ఘనంగా ఉన్నా ఎపిఆర్‌జెసి ఇలా దీనస్థితికి చేరుకోవడంపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలమైన తరగతి గది

వేధిస్తున్న సౌకర్యాల కొరత

36 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ కళాశాల భోజన తయారీ భవనం శిథిలావస్థలో ఉంది. నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరం. విద్యార్థులు భోజనం చేసేందుకు కూడా సరైన వసతులు లేక పూర్వ విద్యార్థులు సహకారంతో నిర్మించిన ఓ రేకుల షెడ్డులో భోజనం చేస్తున్నారు. అక్కడ కూడా సరైన వసతి సౌకర్యాలు లేవు. ఈ కళాశాలకు నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించి 36 సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటికీ ఏ ఒక్క నూతన భవనం ఏర్పాటు చేయలేదు.

సిఎస్ఆర్ నిధులతోనైనా పూర్వ వైభవం వచ్చేనా..?

కొడిగినహళ్లి ఏపీఆర్జేసీ జూనియర్ కళాశాల అభివృద్ధికి కియా పరిశ్రమ నిర్వాహకులు నిధులు కేటాయిస్తుండటంతో సిఆర్ఎస్ నిధుల ద్వారా పూర్వవైభవం వచ్చేనా అన్న ఆశలు కలుగుతున్నాయి. పెనుగొండ కేంద్రంగా ఏర్పాటు చేసిన కియా పరిశ్రమ యాజమాన్యం రూ.2.86 కోట్ల రూపాయల మేరకు నిధులు కేటాయించింది. దీని ద్వారా కళాశాలలో రెండు డార్మెటరీ భవనాల ఏర్పాటు తోపాటు డైనింగ్ హాల్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నిధులకు తోడు ప్రభుత్వం కూడా అవసరమైన నిధులను విడుదల చేసి శిథిలావస్థల్లో ఉన్న తరగతి గదుల మరమ్మతులు చేయడం, సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవాల్సిఉ ంది. తేవాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.



సిఎస్ఆర్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు

సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

కియా పరిశ్రమ విడుదల చేసిన సిఎస్ఆర్ నిధుల ద్వారా ఎపిఆర్‌జెసిలో ఇటీవల కొన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన బాత్రూంల నిర్మాణాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించాం. వీటితోపాటు మరిన్ని అభివృద్ధి పనులను కళాశాలలో జరుగుతున్నాయి. ఇవన్నీ పూర్తయితే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

శ్రీదేవి, ఎపిఆర్‌జెసి ప్రిన్సిపల్, కొడినహళ్లి.



అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలి

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేసి, వారిని ప్రభుత్వం ఉద్యోగు లుగా గుర్తించాలని రాష్ట్ర అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం పుట్టపర్తి సాయి ఆరామంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిఎస్.శ్రీదేవి అధ్యక్షతన ఆ సంఘం జిల్లా 2వ మహాసభ నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, జిల్లా శ్రామిక మహిళ అధ్యక్షురాలు దిల్షాద్, అనంతపురం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శకుంతల, రమాదేవి పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేస్తూ అనేక డిమాండ్ల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఇతర కొన్ని రాష్ట్రాల్లో కనీస వేతనాలు అమలు చేస్తున్నారని, ఈ రాష్ట్రంలో కూడా అమలు చేయాల్సి ఉందన్నారు. ఈ డిమాండ్ల సాధనకు అంగన్వాడీలు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీలకు ఇతర పనులను అప్పగించరాదని, కొత్త మొబైల్‌లను వెంటనే పంపిణీ చేయాలన్నారు. కిచెన్ బిల్లులను పెంచాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపచేయాలని, అర్హులైన అంగన్వాడీలు హెల్పర్లకు వితంతు, వికలాంగ పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి పోరాటం సరైన మార్గమని అందుకు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

జిల్లా నూతన కమిటీ ఎంపిక

అంగన్‌వాడీ జిల్లా నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా సిఎస్.శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీదేవి, కోశాధికారిగా రంగమ్మ, ఉపాధ్యక్షురాలుగా దిల్షాద్, మహాదేవమ్మ, ఉషారాణి, శోభారాణి, మొత్తం 34 మందితో కమిటీని ఎన్నుకున్నారు.



ఎమ్మెల్యే దగ్గుపాటి, నాయకులతో కలిసి సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు

సభను 'సూపర్‌హిట్' చేద్దాం

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 10వ తేదీన అనంతపురంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సూపర్ సిక్స్, సూపర్‌హిట్' సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శుక్రవారం నాడు ఆయన రామ్‌నగర్‌లోని షిర్డీసాయి కళ్యాణ మండపంలో టిడిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ ఏర్పాట్లపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జిఎంఆర్ గ్రౌండ్ సభావేదిక వద్ద ఎంపి బికె.పార్థసారథి, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, గుంటూరు మేయర్ నాని, ఆప్కాబ్ ఛైర్మన్ గండి వీరాంజినేయులు, ఆహుడా ఛైర్మన్ టిసి.వరుణ్, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూలనాగరాజు, టిడిపి జిల్లా పరిశీలకులు వెంకటేశ్వర్లు, సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను సూపర్-6 ద్వారా అమలు చేసి పాలనను సూపర్ హిట్ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కిందన్నారు. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు, పింఛన్ల పెంపు, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్ల ప్రారంభం తదితర వాగ్దానాలను అమలు చేశామన్నారు. వీటితో పాటు మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు ఉద్యోగాలకు ఇచ్చామన్నారు. పరిశ్రమలకు ఏర్పాటు చేస్తూ యువతకు ఉపాధి కల్పించే దిశగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజల వద్ద గర్వంగా చెప్పుకునేందుకు నిర్వహిస్తున్న సూపర్‌హిట్ సభను విజయవంతం చేసేలా ప్రతి ఒక్క టిడిపి నాయకుడు, కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం అర్బన్ నియోజకవర్గంపై ఎంతో నమ్మకం ఉంచి నిర్వహణ బాధ్యతలను అప్పగించారన్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా 44వ సంవత్సరాల తర్వాత జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళి, మాజీ మేయర్ స్వరూప, జిల్లా పరిశీలకులు సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

7న ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ధర్మవరం పట్టణంలోని ఎన్జీవో హోం కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 67 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేయనున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ ఆత్మీయ ట్రస్ట్, యుటిఎఫ్ ధర్మవరం జోన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు వెల్లంకి నాగినీడు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, బోధనలో విశేషమైన సేవలు అందిస్తూ విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షులు కె.భూతన్న, కార్యదర్శులు నారాయణస్వామి, జిసి.నరేష్‌కుమార్, గంగాధర్, మారుతి, ఉపేంద్రమూర్తి, పెద్దిరాజు, మాలింగప్ప, బాబు, జోగప్ప పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్రికెట్ టోర్నీ విజేత రొద్దం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

యుటిఎఫ్ జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా రొద్దం జట్టు నిలిచింది. యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.రామాంజనేయులు జ్ఞాపకార్థం పెనుకొండ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టోర్నీ కన్వీనర్ జిసి.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వాణి, ఎంఇఒ రాఘవయ్య, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో రొద్దం, ఎన్‌పి.కుంట జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ఎన్‌పి.కుంట జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 115 పరుగులు చేసింది. ఛేదనలో రొద్దం సూపర్ కింగ్స్ జట్టు 11 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఘన విజయం సాధించింది. రొద్దం జట్టు కెప్టెన్ నరేష్‌కుమార్(60నాటౌట్) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. ముఖ్యఅతిథులు విన్నర్స్, రన్నర్స్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాబు, సీనియర్ నాయకులు చెన్నకేశవులు, డివిజన్ నాయకులు గంగాధర్, శివయ్య, శ్రీనివాసులు, ప్రభాకర్, విష్ణు, జగదీశ్, రామాంజనేయులు, అశోక్, పాల్గొన్నారు.



విజేత రొద్దం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మడకశిరకు రూ. 1200 కోట్లతో మరో పరిశ్రమ:ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర టౌన్

నియోజకవర్గంలో రూ. 1200 కోట్లతో మరో భారీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్‌లో తీర్మానం చేశారని, తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2 వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో మడకశిర ప్రాంతానికి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు వస్తాయన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజక వర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ అనంతపురంలో ఈ నెల 10వ తేదీ నిర్వహిస్తున్న 'సూపర్‌సిక్స్-సూపర్ హిట్' విజయోత్సవ సభ నిర్వహిస్తున్నారని, ఆ సభకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, బిజెపి అధ్యక్షుడు మాధవ్, తదితర ప్రముఖ నాయకులు హాజరవుతారని, కావున నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డిఫెన్స్ ఫ్యాక్టరీ, టెలికాం పరిశ్రమ, సోలార్ ప్రాజెక్టు, గాయత్రి కాలనీలోని పరిశ్రమలు మడకశిరకు తలమానికంగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే హంద్రీనీవా కాలువలో ముళ్లపొదల తొలగింపు పనులు జరుగుతున్నాయని, అక్టోబర్ తొలి వారంలో నియోజకవర్గానికి నీరు వస్తాయన్నారు. సమావేశంలో కడప డిసిసి ఛైర్మన్ జయప్రకాష్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఛైర్మన్ రాజు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గురుమూర్తి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

సమస్యల వలయంలో కెడి.పాలెం పాఠశాల..!

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని జమ్మలబండ పంచాయతీ పరిధిలోని కెడి.పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఇందులో గతంలో చాలామంది విద్యార్థులు ఉండేవారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో క్రమేణా తల్లిదండ్రులు తమ పిల్లలను పట్టణాలు, మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడంతో ఇక్కడ విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోయింది. ప్రస్తు తం ఈ పాఠశాలలో 24 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. వారికి బోధించేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా గత ప్రభుత్వంలో 'నాడు-నేడు' నిధులు కూడా మంజూరు కాలేదు. పాఠశాల భవనం నిర్మించి 25 ఏళ్లకు పైగా కావడం తో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అప్పుడప్పుడు పైకప్పు పెచ్చులు ఊడి పడుతుంటాయి. వర్షం కురిస్తే తరగతి గదులు, వరండా మొత్తం కారు తుంది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా కూర్చోవ డానికి స్థలం లేక విద్యార్థులు ఇళ్లకు వెళ్లి పోవాల్సిన దుస్థితి నెలకొంది. సరైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో హెచ్ఎం రమేష్ సొంత నిధులతో పైప్‌లైన్ చేయించి విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. పాఠశాలలో కొన్నేళ్లుగా విద్యార్థులు, ఉపాధ్యా యులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నా విద్యా శాఖ అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పాఠశాలకు నూతన భవనం చేపట్టాలని, సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



పెచ్చులూడిన తరగతి గది పైకప్పు



అధ్వాన్న స్థితిలో మరుగుదొడ్లు

పెనుకొండను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం : మంత్రి

నగర పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తాం : అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్

ప్రజాశక్తి-పెనుకొండ

నగర పంచాయతీని ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని వై జంక్షన్ నుంచి మార్కెట్ యార్డ్ వరకూ రూ. 92 లక్షల నిధులతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు శుక్రవారం మంత్రి సవిత, అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డును రూ.50 లక్షలతో పూర్తి చేశామన్నారు. కోనాపురం గ్రామానికి రూ. కోటితో బీటీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. రూ. 50 లక్షలతో డ్రైనేజీ పనులు ప్రారంభమయ్యాయన్నారు. రూ.62 లక్షలతో అన్న కాంటీన్ భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ. వంద కోట్లతో అమృత్ పథకం కింద ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. ఐటిఐ కళాశాల మం జూరైందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వెయ్యికి పైగా సోలార్ లైట్లు వేయించామన్నారు. త్వరలోనే అర్హులందరికీ హౌసింగ్ ఇస్తామన్నారు. అహుడా ఛైర్మన్ టిసి. వరుణ్ మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మెడికల్ కళాశాల వరకూ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని, రూ. 16 కోట్లతో ఎంఐజి లే ఔట్‌ను అభివృద్ధి చేసి లబ్ధిదారులకు అందుబాటు లోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సతీష్ కుమార్, అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ఆర్డీవో ఆనంద్ కుమార్, పబ్లిక్ హెల్త్ రామ్మోహన్ రెడ్డి, డిపిహెచ్ఒ నరసింహమూర్తి, సగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సవిత, చిత్రంలో అహుడా ఛైర్మన్

శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

గోరంట్ల : పట్టణంలోని బస్టాండ్ వద్ద శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం మంత్రి సవిత భూమిపూజ చేశారు. పట్టణంలో కాపు భవనం నిర్మాణానికి 50 సెంట్లు కేటాయించామని, త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. మంత్రి విలేకరులతో మాట్లాడుతూ భారత దేశాన్ని పాలించిన వారిలో శ్రీకృష్ణదేవరాయలు గొప్ప చక్రవర్తి అన్నారు. రాజ్యంలో విస్తృతంగా చెరువులు, సాగునీటి కాలువలు ఏర్పాటు చేశారని, ఆలయాలు నిర్మించారన్నారు. ప్రజా సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిచ్చారన్నారు. పెనుకొండలో కొండపై నరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్టాపన చేయిస్తామని, శ్రీకృష్ణదేవరాయలు ఉత్సవాలు, లేపాక్షి ఉత్సవాలు నిర్వహిస్తామ న్నారు. వీటిపై త్వరలోనే ప్రకటన చేస్తామన్నారు. ఈ నెల 10వ తేదీ అనంతపురంలో నిర్వహించే విజయోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

చిన్నకోడిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి..

రొద్దం : మండలంలోని చిన్నకోడిపల్లి గ్రామానికి రూ. 1.2కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి సవిత భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ 15 నెలల్లోనే పలు చోట్ల సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఎంజెపి స్కూల్ నిర్మాణం కోసం రూ. 17.5 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రూ. 50 లక్షలతో నూతన బిల్డింగ్ ప్రారంభించామని, రూ 2 కోట్లతో పెదమంతూరులో పిహెచ్‌సి భవనం నిర్మాణం జరుగుతోందన్నారు. దొడగట్టలో రూ. 3.5 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, త్వరలో ప్రారంభిస్తామ న్నారు. పశువుల తొట్టెలు, 44 గోకులం షెడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ప్రజాశక్తి - తలుపుల

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉబర్వాండ్లపల్లిలో వైద్యాధికారులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఆఫ్తాఫ్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రామ్మోహన్, సిహెచ్ఒ శ్రీవాణి, హెల్త్ అసిస్టెంట్స్ నాగరాజు, రామాంజులు రెడ్డి, మనోహర, సువర్ణ, ఆశా కార్యకర్తలు అంజనమ్మ, అలివేలమ్మ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలో పంటలు నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆపార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముదిగుబ్బను కరువు మండలం గా ప్రకటించి రైతులను అన్ని విధాలా దుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పెద్దిరెడ్డి పల్లి గ్రామంలో ఇటీవల ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదానికి గురైన మమత హిందూపురం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమె కుటుంబ పోషణ కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతుందన్న విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు బీసీ సంక్షేమ చేనేత టెక్స్టైల్ శాఖ మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

ఘనంగా ఓనం వేడుకలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కేరళీయులు ఎంతో పవిత్రంగా భావించే ఓనం పండుగను ఘనంగా జరుపుకొన్నారు. శుక్రవారం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభ మందిరంలో కేరళీయులు తమ సాంప్రదాయాలతో ఈ పండుగను జరుపుకొన్నారు. పుట్టపర్తి లో అనేక సంవత్సరాలుగా కేరళ రాష్ట్ర ప్రజలు చాలామంది స్థిర నివాసం చేసుకుని ఉంటున్నారు. హోటల్లు, సత్యసాయి చిత్రపటాలు విక్రయాలు, లాడ్జిలు నిర్వహణ తదితర వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ ఓనం పండుగకు వారి బంధువులు కేరళ నుంచి పలువురు ఇక్కడికి వచ్చారు. వారందరితో కలిసి నూతన వస్త్రాలు ధరించి సాయి కుల్వంత్ హాలు లో సత్యసాయి మహాసమాధి వద్ద పండుగను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సాయి కుల్వంత్ హాలు ను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. గత రెండు రోజుల నుంచి ఓనం వేడుకలు జరుగుతున్నాయి. మొదటి రోజున ఇస్రో చైర్మన్ నారాయణన్ పాల్గొని ప్రసంగించారు. రెండవ రోజు సాయి కుల్వంత్ హాలులో ఉదయం, సాయంత్రం భక్తి గీతాలను కేరళ భక్తులు ఆలపించారు. బాబా సమాధి దర్శించుకున్నారు.

తాగునీటి సమస్య

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని దోరనాల గ్రామంలో కొందరి స్వార్థం వల్ల తాగునీటి సమస్య ఏర్పడిందని గ్రామానికి చెందిన మహిళలు వాపోతున్నారు. గ్రామంలోని ఎస్‌సిఎస్, టిబిసి కాలనీలో దాదాపు 60 కుటుంబాలు ఉన్నాయన్నారు. తమ కాలనీకి తాగునీరు సరఫరా అయ్యే పైపులైనుకు కొందరు మోటర్లు బిగించుకోవటంతో తమకు నీరు సరఫరా కావటం లేదన్నారు. గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి, అచ్చమ్మ బోరు మోటర్ల కనెక్షన్లు తీసుకొని నీటిని తోడేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని చెప్పారు. సమస్యను సర్పంచికి, అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి తమ కాలనీకి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన మహిళలు కోరుతున్నారు.

ఆదర్శం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న జేసీ



కదిరిలోని షిర్డీసాయి స్కూల్‌లో టీచర్స్‌డే వేడుకలు

జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్
జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జగరాజుపల్లి మంగళకర పాఠశాలలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జేసీ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థిని భవిభారత పౌరునిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర వహిస్తారని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ప్రతి ఉపాధ్యాయుడు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాజంలో ఉపాధ్యాయునికి ఎంతో గౌరవం ఉంటుందన్నారు. జ్ఞానాన్ని సంపాదించడానికి ఎన్నో మార్గాలు ఉన్నా ఉపాధ్యాయుడు లేకుండా జ్ఞానాన్ని సంపాదించడం ఉండదని అన్నారు. ప్రతి ఒక్కరూ సమాజంలో ఎలా మెలగాలి ఎలా మాట్లాడాలి అనే అంశాలను గురువుతోనే నేర్చుకుంటారని చెప్పారు. విద్యార్థులు ప్రతిక్షణం ఉపాధ్యాయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని చెప్పారు. తన తండ్రి కూడా ఒక ఉపాధ్యాయుడిని ఆయన ద్వారా ఎన్నో విషయాలను తెలుసుకోవడం జరిగిందని అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప, సర్వ శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవరాజు, ఏపీ మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ సద్దలపల్లి గంగాధరప్ప, ఏపీ కురుబ, కురుమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బుక్య కాలే నాయక్, ఏపీ ట్రైబల్స్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు సభావాత్ సోమ్లా నాయక్ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఇతర ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన గావించి డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గురుపూజోత్సవం 2025 ను పురస్కరించుకొని విద్యారంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా జిల్లా విద్యాశాఖ అధికారి వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 71 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను జేసీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పిట్ట వెంకటస్వామి, రమేష్ బాబు, నాగేంద్ర, కే వెంకటేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి వివరించారు. విద్యాపరంగా 30 సంవత్సర సేవలందించి ఎందరో ఉన్నత శిఖరాలకు చేర్చిన ఉపాధ్యాయులైన విశ్వరూప్, గోవింద్‌ను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కదిరి టౌన్ : పసుపులేటి సురేష్ కుమార్ ఆధ్వర్యం లో శ్రీ షిర్డీసాయి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు విద్యార్థులు ఉపాధ్యాయులు గురుపూజోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయదినోత్సవం విశిష్టతను వివరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం గురించి తెలిపారు.

హిందూపురం :డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా హిందూపురం పట్టణ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా పట్టణంలోని సప్తగిరి కళాశాలలో వేడుకలు నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనాథ్ రెడ్డి ఏఓ బి. గంగిరెడ్డి సప్తగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మంజునాథ్ అదేవిధంగా ఎన్ఎస్ఎస్ పిఒలు ఎస్.పార్థసారథి, ఏ.కేశవరెడ్డి, బి.రామకష్ణ, జి.ప్రకాష్ పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు: మండల వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా గురుపూజోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువులను కస్పాండెంట్ పిట్టా శివ శంకర్ రెడ్డి సన్మానించారు. అంతకు ముందు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలసి నివాళులర్పించి కేకును కట్ చేశారు. పూర్వ గురువు షేక్ జమాల్ ను పూర్వ విద్యార్థి స్థానిక జడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న నిర్మల ఘనంగా సన్మానించారు.

ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలోనిసాధన విద్యా సంస్థ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తపేట మున్సిపల్ బాలికల హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ , సన్మాన గ్రహీతలను సన్మానించారు. ఈసందర్భంగా మున్సిపల్ హై స్కూల్ రిటైర్డ్ హెడ్మాస్టర్ బి. సంజీవయ్య , రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయులు హనుమంత రెడ్డి, సాధన పాఠశాల సీనియర్ టీచర్లు అరుణ, మీనజ్ బేగంను సత్కరించారు, ఈ ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ సీతా పతిరావు , వాసవి, కృష్ణమ నాగరాజు, పాఠశాల డైరెక్టర్లు భువనేశ్వరి దేవి నాగార్జున బాబు,కుళ్ళాయమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : బత్తలపల్లిలోని శ్రీజ్యోతి హై స్కూల్ లో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మిడతల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు నాగ పెద్దిరాజు, లక్ష్మీసువర్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ డైరెక్టర్ మిడతల ధర్మతేజ, ఉపాధ్యాయులు శంకరయ్య, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ :పట్టణంలోని ఎంఇఒ కార్యాలయంలో శుక్రవారం గురుపూజోత్సవ వేడుక లను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం పురస్క రించుకొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంఇఒ రాఘవయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండలంలోని ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు బసిరెడ్డిని సన్మానించారు. అలాగే ఎంఇఒ రాఘవయ్యను ఉపాధ్యాయ బృందం, ఎంఆర్‌సి సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నారాయణస్వామి, రవీంద్ర, నరేష్, బాబు, పెద్దిరాజు, ఉపేంద్ర, హసీనా, సునీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా ఘనంగా నిర్వశించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేశారు.

మడకశిర టౌన్ : సమాజంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎపి స్కూల్ టీచర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మారుతి ప్రసాద్ మాట్లాడుతూ గురువులే సమాజానికి మార్గదర్శకులు అన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు బిఎస్.రామకృష్ణ, దేవరాజులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిపి.రవీంద్ర, సుజాత, గీత, ఆదినారాయణ, పార్థు, పరశురామ్, రమేష్, సాయి, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపల్ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, 12వ పిఆర్సి అమలు చేసి కనీస వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్రఅధ్యక్షులు నాగభూషణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామం లో ఆ సంఘం (సిఐటియు అనుబంధ) 3వ జిల్లా మహాసభ స్థానిక మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సి. రామకృష్ణ, జివిఎల్. నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాగభూషణ మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల తలరాతలు మారలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్‌ల పేరుతో చట్టాలను కుదించి కార్మిక సంఘాలు పెట్టుకునే హక్కు లేకుండా చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను మార్పు చేశారన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ పర్మనెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని, 12 పి అర్ సి ని అమలు చేసి, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శానిటేషన్, ఇంజనీరింగ్, యుజిడి కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. 8 గంటల పని వేళలను 12 గంటలకు పెంచడం అన్యాయమన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అందుకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, శానిటేషన్ నాయకులు నాగార్జున, రామయ్య, నరసింహులు, కేశవ, సాయి ప్రసాద్, తిరుపాలు, ఇంజనీరింగ్ కార్మిక నాయకులు రమణ, గణేష్, రమేష్, రామదాసు, పెద్దక్క, అనిత, వెంకట లక్ష్మమ్మ, ఇంజనీరింగ్ కార్మికులు నాగరాజు, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని టీటీకే కోల్డ్ స్టోరేజ్ సమీపంలో శుక్రవారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడు పట్టణంలోని లక్ష్మీపురానికి చెందిన నిఖిల్ (30)గా గుర్తించారు. నిఖిల్ మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సుంది.

లైంగిక వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ఓ వార్డుకు చెందిన 13 ఏళ్ల బాలికపై అనిరుధ్ అలీ అనే లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తండ్రి స్థానంలో ఉండాల్సిన అనిరుధ్ అలీ అసభ్యంగా ప్రవర్తించడమే కాక వీడియోలను తీసి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆమె ఆరోపించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనిరుధ్ అలీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖపూర్‌కు చెందిన వాడు.

రైల్వే ట్రాక్ సమీపంలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-సోమందేపల్లి


మండలంలోని పందిపర్తి గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన శుక్రవారం స్థానికులు ఓ మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన వివరాలు.. కర్నాటకలోని గుల్బర్గా జిల్లా కమలాపూర్ గ్రామానికి చెందిన కల్లప్ప(60) రాత్రి ప్రయాణం చేస్తున్న పందిపర్తి సమీపంలోని ఓ బ్రిడ్జి వద్ద రైలులో నుంచి జారి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి వద్ద ఉన్న పుస్తకంలో సమాచారం మేరకు బంధువులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తులు డోర్ వద్ద నిల్చొని ప్రయాణించరాదని, రైలు ఎక్కడం, దిగడంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కార్పొరేషన్ అభివృద్ధికి కృషి

ఎపి స్టాక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేష్

ప్రజాశక్తి - పరిగి

కార్పొరేషన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితుడైన మండలంలోని శాసనకోటకు చెందిన ఉప్పర వెంకటేష్ అన్నారు. ఏపీ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వెంకటేష్‌ను నియమిస్తూ ఆ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పరిగి మండల టిడిపి నాయకులు శుక్రవారం పరిగి మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో వెంకటేష్‌ను ఘనంగా సన్మానించారు.సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు నుంచి పార్టీ అభివృద్ధికి తాను చేసిన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం తనకు ఈ పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. తన ఎంపికకను సహకరించిన బీసీ సంక్షేమ చేనేత టెక్స్టైల్స్ శాఖ మంత్రి సవితమ్మకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ నాయకులు, కన్వీనర్ ఎస్ ఎం గోవింద్ రెడ్డి, బాలాజీ, సోమప్ప, నాగభూషణం డి ఎస్ ఎల్ శ్రీనివాసులు కంకర శ్రీనివాసులు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.




వెంకటేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

యూరియా పంపిణీపై ప్రత్యేక నిఘా : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

యూరియా పంపిణీ విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు దుకాణాల వద్ద నిఘా పెంచాలని, తద్వారా రైతులకు యూరియా సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లాలో యూరియా లభ్యత, వినియోగం తీసుకోవలసిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల వద్ద ఎంత యూరియా స్టాకు ఉంది, ఎంత డిమాండ్ ఉంది, ఎంత సరఫరా అయ్యింది అనే వివరాలను ఎప్పటికప్పుడు ఐఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో అప్ డేట్ చేయాలన్నారు. పంపిణీ జరిగే చోట వీఆర్వోల పర్యవేక్షణ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ యూరియా అక్రమ రవాణా కాకుండా సక్రమంగా పంపిణీ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డీవోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వ్యవసాయ అధికారులు, సమన్వయం చేసుకొని రైతులకు ఏ సమస్యలు ఎదురుకాకుండా చూడాలన్నారు. జిల్లా శిక్షణ కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని సమస్య ఎదురైతే రైతులు 91777 68271 లేదా 99482 24545 కు ఫోన్ చేయవచ్చున్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి రమ నాయక్, మార్క్‌ఫెడ్ డిఎం గీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

శోభాయాత్రలో అపశృతి

డిజెల శబ్దానికి పెచ్చులూడిన భవనాలు
పలువురికి గాయాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో జరిగిన వినాయక నిమజ్జన శోభాయాత్రలలో ఆపశృతి చోటుచేసుకుంది. శుక్రవారం తెల్లవారు జామున అంబేద్కర్ సర్కిల్లో డిజె సౌండ్ వల్ల పాత బిల్డింగ్ పెచ్చులు ఊడి జబివుల్లా, మల్లేష్ అనే వ్యక్తులపై పడ్డాయి. ఈ ప్రమాదంలో మల్లేష్‌కు తీవ్ర గాయాలు అయినాయి. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. అదే విధంగా రైల్వే రోడ్డులో డిజే సౌండ్‌తో ఓ మహిళా ఒక్క సారిగా కుప్పకూలిపోయింది. హిందూపురం పట్టణంలోని బాలాజీ సర్కిల్ నందు గణేష్ శోభాయాత్ర లో భాగంగా రాత్రి 12గంటల సమయంలో పటాసులు పేల్చడంలో శృతి తప్పి పలువురికి గాయాలు అయ్యాయి. గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న మున్సిపల్ చైర్మన్ డిఈ. రమేష్ కుమార్ వెంటనే క్షతగాత్రులను పరామర్శించారు.

అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు



అవార్డు అందుకుంటున్న బుక్కపట్నం మండల ఉపాధ్యాయుడు



అవార్డు అందుకుంటున్న గోరంట్ల మండల ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మందలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రంగనాథ్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో ఆయన పుట్టపర్తిలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ టిఎస్.చేతన్, డిఇఒ జి.కృష్ణప్ప నుంచి అవార్డు అందుకున్నారు. అలాగే ఆయనకు డిఇఒ, పాఠశాల సిబ్బంది పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అవార్డు గ్రహీత రంగనాథ్ మాట్లాడుతూ నా సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంఇఒలు ప్రసాద్‌రెడ్డి, రవిచంద్రకుమార్, ఉపాధ్యాయులు రంగనాథ్‌కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో ముత్తుకూరు పాఠశాల హెచ్ఎం మంజునాథ్, సిఆర్‌పి భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం గ్రామ మోడల్ స్కూల్ హెచ్ఎం నీలం అశోక్, కసిరెడ్డిపల్లి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు చిట్టెమ్మ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఇఒ జి.కృష్ణప్ప నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. వారిని ఎంఇఒలు జాన్‌రెడ్డప్ప, గోపాల్, మండలంలోని తోటి ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందించారు

బుక్కపట్నం :మండల పరిధిలోని ధూపం పల్లి ఎం పి ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బులగొండ్ల తిప్పన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నాడు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఈవో కిష్టప్ప చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ 2002 సంవత్సరంలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టి పలు పాఠశాలలో ఉత్తమ విద్యా బోధన అందించినందుకు ప్రభుత్వం తనకు గుర్తింపు ఇచ్చిందన్నారు. ఈ అవార్డుతో తనపై మరింత గురుతర బాధ్యత పెరిగిందని తెలిపారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయులు జగదీష్, శ్రీకాంత్ జిల్లాస్థాయి అవార్డులు అందుకున్నారు. అవార్డు గ్రహీతలకు తోటి ఉపాధ్యాయులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

కొత్తచెరువు :కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో జిల్లా స్థాయి ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన వారికి, బదిలీ అయిన ఉపాధ్యాయులకు పెనుగొండ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి జాన్ రెడ్డప్ప ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో ఎంఇఒలు సోమశేఖర్, జయచంద్ర, హెచ్ఎం గోపాల్, వెంకటేశు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలం దంపేట్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జి.వెంకట్ రెడ్డి, రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తలారి లక్ష్మీనారాయణ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. వీరికి జేసీ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. వారిని తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

ఏపీ స్టేట్ అగ్రికల్చర్ డైరెక్టర్ బంగారు కృష్ణమూర్తికి ఘన సన్మానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఏపీ స్టేట్ అగ్రికల్చర్ డైరెక్టర్‌గా నియమితులైన బంగారు కృష్ణమూర్తిని వాల్మీకి సంఘాల నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బంగారు కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ కండక్టర్ గా జీవిత ప్రయాణాన్ని మొదలుపెట్టి తాను రాష్ట్ర అగ్రికల్చర్ డైరెక్టర్ వరకు ఎదిగానని చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తనను అధిష్టానం గుర్తించిందన్నారు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రైతుల జీవితాలలో మెరుగైన మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకులు హరిమోహన్,సురేంద్ర రెడ్డి, క్రిష్ణ,భాష తదితరులు బంగారు కృష్ణమూర్తిని సన్మానించారు. అతే విధంగా రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం నాయకులు బంగారు కృష్ణమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, నరసింహులు, శివ ప్రసాద్, మోహన్, పరుశురాం, అంజనాదేవి, ప్రమీల, నాగవేణి,నాగేశ్వరి, వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.



బంగారు కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన నేపథ్యంలో ఈనెల 10న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనంతపురానికి రానున్నారని ఆ సభలను విజయవంతం చేయాలని కూటమి శ్రేణులకు స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని చెప్పారు.అందులో భాగంగా గతంలో ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసామని చెప్పారు. కదిరి పట్టణ శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అలాంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారిని గుర్తించి తన వాట్సాప్ కు ఫోటోలతో సమాచారం అందజేస్తే సమాజ హితానికి కృషి చేసిన వారు అవుతారని ప్రజలకు సూచించారు. సమాజం కోసం యువత కోసం ఎటువంటి పరిస్థితులు ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలను ఉపేక్షించే ప్రసక్తి లేదనీ స్పష్టం చేశారు. అలాగే కదిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలాన్ని కొందరు కోర్టును ఆశ్రయించి కాజేయాలని చూస్తున్నారని పాఠశాల ఆట స్థలాన్ని పరిరక్షిస్తామని చెప్పారు. ఈనెల 10న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనంతపురం పర్యటనను పురస్కరించుకొని 8న కదిరి పట్టణం పివిఆర్ గ్రాండ్ నందు సన్నాహక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

7న యుటిఎఫ్ ఆధ్వర్యంలో పురస్కారాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ధర్మవరం పట్టణంలోని ఎన్జీవో హోంలో 7వ తేదీన ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ ధర్మవరం జోన్ సహకారంతో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వివిధ కేడర్లలో విశేష సేవలు అందిస్తున్న 67 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేయనున్నట్లు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమ నిర్వాహకులు స్థానిక ఎన్జీవో కార్యాలయం ముందు సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఆత్మీయ ట్రస్ట్, యుటిఎఫ్ ధర్మవరం జోన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు శ్రీ వెల్లంకి నాగినీడు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, బోధనలో విశేషమైన సేవలు అందిస్తూ విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్న 67 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ నాయక్, యుటిఎఫ్ నాయకులు ఆంజనేయులు, హరికృష్ణ, వెంకట కిషోర్, అమర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నాయకులు

నిర్లక్ష్యానికి నిదర్శనం విద్యుత్ శాఖ

వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజల ఇబ్బందులు
అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం
ఇండోర్ సబ్ స్టేషన్ ఉన్నా ఫలితం సున్నా

ప్రజాశక్తి-హిందూపురం

నిర్లక్ష్యానికి నిదర్శనం ఏదైనా శాఖ ఉంది అంటే అది విద్యుత్ శాఖ అనిచెప్పవచ్చు. ఎన్నో సంవత్సరాలుగా హిందూపురం పట్టణంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా నిమజ్జన కార్యక్రమం జరుగుతుంది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ సంవత్సరం విద్యుత్ శాఖ అధికారులు... సిబ్బంది సమన్వయ లోపంతో దాదాపు 24 గంటలు పైబడి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో గురువారం రాత్రి పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారుల్లో విద్యుత్ సరఫరాను కొనసాగించి. అయితే నిమజ్జనమే జరగని ప్రాంతాల్లో సైతం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నిమజ్జనం పేరుతో ధర్మపురం, పాండురంగ నగర్, శ్రీకంఠాపురం, ముక్కిడిపేట, ఆజాద్ పేట తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటలకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి శుక్రవారం ఉదయం 9 గంటలు గడిచినప్పటికీ విద్యుత్ సరఫరాను కొనసాగించలేకపోయారు. మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో ఒక గంట సేపు విద్యుత్ సరఫరా కొనసాగించి తిరిగి విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. కొంత మంది వారి నివాసంలో యుపిఎస్ ఉన్నప్పటికీ దాని బ్యాటరీలు చార్జింగ్ పూర్తిగా అయిపోయాయి. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై పట్టణవాసులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి విగ్రహాలన్నీ బైపాస్ రోడ్డు మీదుగా ఎంజీఎం పాఠశాల మలుపు తిరిగిన వెంటనే విద్యుత్ సరఫరాను కొనసాగించేవారు. శుక్రవారం తెల్లవారుజాము నాలుగు గంటలకే విగ్రహాలన్నీ ఎంజీఎం పాఠశాల మలుపు తిరిగి కోనేరు వైపు వెళ్లాయి. అయినప్పటికీ విద్యుత్ సరఫరాను కొనసాగించ లేక పోయారు.

ఇండోర్ సబ్ స్టేషన్ ఉన్నా ఫలితం సున్నా

పట్టణంలో వినాయక నిమజ్జనంతో పాటు ఇతరత్రా కార్యక్రమాలు జరిగిన సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరాను కొనసాగించే విధంగా సుమారు రూ. 2 కోట్లు వెచ్చించి వాసవి ధర్మశాల రోడ్డులో 33/11 కేవి ఇండోర్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. అధునాతన సౌకర్యాలతో సబ్ స్టేషన్ ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో కాకపోయినప్పటికీ కనీస స్థాయిలో సైతం విద్యుత్ సరఫరాను అధికారులు కొనసాగించలేకపోయారు.

అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం

వినాయక నిమజ్జనం సందర్భంగా గతంలో విద్యుత్ శాఖలో అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకొని, నిమజ్జనం జరిగే ప్రాంతాలు, వినాయక విగ్రహాల శోభాయాత్ర జరిగే ప్రాంతాలలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్లను గుర్తించి అటువైపు విద్యుత్ సరఫరాను నిలిపివేసే కార్యక్రమాలు నిర్వహించని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా కొనసాగించారు. అయితే ఈ సంవత్సరం విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదం పేరు చెప్పి పని భారాన్ని తప్పించుకోవడానికి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. నిమజ్జన కార్యక్రమం ముగిసి గంటలు గడుస్తున్నా తమకేమీ పట్టనట్లు విద్యుత్ శాఖ అధికారులు వ్యవహరించారు. ముఖ్యంగా పట్టణంలో డి-1 సెక్షన్ లో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గురువారం రాత్రి సమయానికి ఆజాద్ పేటలో ఉన్న వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఉన్న బ్యాటరీల చార్జింగ్ పూర్తిగా అయి పోయింది. దీంతో స్టేషన్ చీకటిమయంగా మారింది. సంబంధిత సివి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లను సంప్రదించి ఎలాగైనా విద్యుత్ సరఫరా కొనసాగే విధంగా చూడాలని కోరినప్పటికీ అధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడలేదు. డి- 1 సెక్షన్ ఇంజనీర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు సిబ్బందితో సమన్వయం చేసుకోకపోవడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తింది.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లిలో శుక్రవారం ఆర్యవైశ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాశ్వత గౌరవాధ్యక్షులుగా రాము, శాశ్వత సలహాదారుడిగా రంగయ్య, అధ్యక్షులుగా వేచ్చం అశ్వర్థనారాయణ, ఉపాధ్యక్షులుగా బిఎస్.రత్నయ్య, సెక్రటరీగా రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీగా జి.రాఘవేంద్రకుమార్, కోశాధికారిగా వినోద్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా నందినిని నియమించినట్లు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటూ పట్టణం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్య వైశ్యులు బాలాజీ, హరీష్, రవీంద్ర, పోలేపల్లి అశోక్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని ఉపాధ్యాయులు శుక్రవారం ఎపిటిఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి.శివన్న, ప్రధాన కార్యదర్శిగా పి.గణేష్‌కుమార్, కౌన్సిలర్‌గా గుడిపల్లి బి.చంద్రను నియమించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి చట్టబద్ధంగా రావాల్సిన నిధులు, హక్కుల కోసం ఎపిటిఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానిం చారు. కార్యక్రమంలో రాష్ట్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్, జిల్లా అధ్యక్షులు కోదూరు శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్లు జవ్వాజి నాగరాజు, దస్తగిరి, ఉపాధ్యాయులు సంజీవరాయుడు, వి.రమేష్, ఇర్ఫాన్, ప్రసాద్‌నాయక్, ఎన్.మధు, రంగేనాయక్, ఉపేంద్ర, శివనాయక్, రంగేష్, తదితరులు పాల్గొన్నారు

అందుబాటులో లేని డెంటల్ ల్యాబ్

ప్రజాశక్తి-హిందూపురం

ఇద్దరు డాక్టర్లు, ఒక టెక్నీషియన్ ఉన్నప్పటికీ జిల్లా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో డెంటల్ ల్యాబ్ అందుబాటులో లేదని, అందుబాటులోకి తెచ్చి పేద ప్రజలకు వైద్యం అందేలా చూడాలని రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజకీయ వేదిక నాయకులు మాట్లాడుతూ హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గత 20 నెలలుగా డెంటల్ వైద్యం పేదలకు అందడం లేదన్నారు. 2019 డిసెంబర్ నెలలో ఎమ్మెల్యే బాలయ్య ఆధ్వర్యంలో అప్పటి ఆసుపత్రి కమిటీ చైర్మన్ జేఈఇ వెంకటస్వామి రూ.5 లక్షలు విలువచేసే డెంటల్ టెక్నీషియన్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి 2023 డిసెంబర్ నాటికి దాదాపుగా 500 పైబడి పేద ప్రజలు వైద్యం పొందారన్నారు. అయితే 2024 జనవరి నుండి నేటి వరకు దాదాపుగా 20 నెలలుగా డెంటల్ ల్యాబ్‌లో వైద్య సేవలు అందడం లేదన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇద్దరు డాక్టర్లు, ఒక టెక్నీషియన్, అవసరమైన ముడి పదార్థాలు అన్ని అందుబాటులో ఉన్నా పేదలకు వైద్యం అందరిని ద్రాక్ష పండుగా మారిందని వాపోయారు. నియోజకవర్గంలో పేద ప్రజలు ఆ ల్యాబ్ లో వైద్య సేవలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌పి జిల్లా కార్యదర్శి ఏ.శ్రీనివాసులు ఎమ్మెస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, జై భారతభీమ్ రావు పార్టీ జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఆల్ ఇండియా బహుజన సమాజ్ వాది పార్టీ జిల్లా అధ్యక్షులు హరికుమార్, తౌసిప్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - నంబులపూలకుంట

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న కుమ్మరుల అభివృద్ధికి తనవంతు కృష చేస్తానిరాష్ట్ర కుమ్మర కులస్తుల చైర్మన్ పేరేపి ఈశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వంకమద్ది గ్రామంలో కుమ్మర కులస్తుల సన్మాన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కుమ్మరులను నేటికీ వెనుకబడి ఉన్నారన్నారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. కుమ్మరుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో హయత్ ఖాన్,జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, సాగునీటి అధ్యక్షులు నాగేంద్ర, గ్రామ టిడిపి అధ్యక్షులు భద్రయ్య, స్కూల్ కమిటీ ఛైర్మెన్ సూర్యనారాయణ, గంగాధర్, నాగార్జున, రెడ్డప్ప, చంద్ర, అంజి, ఓబన్న, బయన్న, నరసింహులు, నాగరాజ, త్రివేణి, అరుణమ్మ, కుళ్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిమజ్జనోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవం రెండవ రోజు శుక్రవారం కొనసాగుతోంది. అధికారుల అంచనాల మేరకు శనివారం ఉదయం 10 గంటలకు అన్ని విగ్రహాలు నిమజ్జనం కావచ్చని తెలుస్తోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 1300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సామాజిక సేవకుల రక్తదానం

ప్రజాశక్తి-హిందూపురం

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా హిందూ, ముస్లిం సామాజిక సేవకులు సంయుక్తంగా శుక్రవారం రక్తదానం నిర్వహించారు. అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్, మానవతా రక్త దాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ డాక్టర్ బాబూ బుడేన్ సమక్షంలో సామాజిక సేవకులు షావలీ సౌజన్యంతో కుల మతాలకు అతీతంగా రక్తదానం చేశారు. ప్రభుత్వ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ (రక్తనిధి)లో జరిగిన ఈ కార్యక్రమంలో రక్తదానం అనంతరం సామాజిక సేవకులకు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పండుగలు, శుభ కార్యాలలో సమాజహిత కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది, సామాజిక సేవకులు ఇందాద్, అబ్దుల్ సలామ్, మాజీ కౌన్సిలర్ జహీర్, బాబా ఫక్రుద్దీన్, పళ్ళేందర్ సింగ్, భగవాన్ సింగ్, కవి శేఖర్, డాక్టర్ అంజాద్ నవాజ్ ఖాన్, డాక్టర్ మున్సూర్, డాక్టర్ యాసీన్ తదితరులు పాల్గొన్నారు.